క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ


బ్యాగ్‌లు అందిస్తున్న లీలాసాయిమాధవ్

నేలకొండపల్లి: మండలంలోని జెడ్పీఎస్‌ఎస్ అప్పలనరసింహాపురం విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ లీలాసాయి మాధవ్ బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాదాపు రూ.40 వేల విలువైన బ్యాగ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, మాజీ సర్పంచ్ మన్నె నగేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్దుబాటులో నిబంధనలు పాటించాలి

కామేపల్లి: మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటులో అధికారులు డీఎస్సీ ఉత్తర్వుల ప్రకారం సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ కోరారు. శనివారం కామేపల్లిలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని పండింట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నల్లమోతు శ్రీనివాసరావు, జక్కుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రవి, నాయకులు వెంకన్న, సైదులు, నరసింహారావు, రమణ, శేషయ్య, రాము, దివ్య, భవాని పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వరదయ్యనగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన శనివారం నిరుపేదలు, శ్రామికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, న్యూరోసర్జన్ డాక్టర్ కె.జగదీష్‌బాబు, కార్యదర్శి దుర్గా నాగేశ్వరరావు, కోశాధికారి కృష్ణమూర్తి, జోన్ చైర్మన్ బీఎస్ రావు, విశ్వేశ్వరరావు, డాక్టర్ డీపీసీ రావు, వెంకయ్య, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో రెడ్ కలర్ డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో ఉన్న బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ - జూనియర్ కాలేజీలో 'రెడ్ కలర్ డే'వేడుకలు నిర్వహించారు. శనివారం ఈమేరకు చిన్నారులందరూ రెడ్ కలర్ దుస్తుల్లో పాఠశాలకు హాజరై ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎరుపు రంగు ఫలాలు, పూలు, కూరగాయాలను ప్రదర్శించారు. అనంతరం ఎరుపు ప్రాధాన్యతను పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి వివరించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	ఏమాయ చేశావె, సూపర్‌మ్యాన్
సాయిరాం	కొత్తపల్లిలో ఒకప్పుడు
ఆదిత్య	జూనియర్
శ్రీనివాస	మై బేబి, కుబేర

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	200		20
బీర	36	తోటకూర	4
దొండ	24		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	20	పుదీన	1
క్యారెట్	48		20
క్యాప్సికం	90		

-ఖమ్మం వ్యవసాయం

దారికొస్తున్నాయ్..


గట్టుసింగారం నుంచి లింగారంతండా వరకు వేసిన బీటీ రహదారి

డొంకరోడ్లకు మహర్దశ..
- బీటీ రహదారులుగా నిర్మాణం
- నిధుల మంజూరుతో శరవేగంగా పనులు
- పాత రోడ్లకు మరమ్మతులు
- తీరుతున్న ప్రజల కష్టాలు

కూసుమంచి: నిన్న, మొన్నటి వరకు కంపచెట్లతో నిండి, గుంతలతో ఇరుకుగా ఉన్న రహదారులు నేడు విశాలంగా మారి బీటీ రహదారులుగా మారుతున్నాయి. దీంతో దశాబ్దాల కాలం నాటి ప్రజల, రైతుల కష్టాలు తీరనున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.వందల కోట్లను విడుదల చేయగా రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.


కొనసాగుతున్న గైగోళ్లపల్లి - బచ్చోడు రోడ్డు పనులు

నర(డ)కయాతన..
గతంలో రహదారులు గుంతలు, కంపచెట్లతో అధ్వానంగా ఉండేవి. కనీసం రాకపోకలు సాగించేందుకు కూడా చాలా ఇబ్బంది పడేవారు. ఇక వర్షాకాలంలో అయితే బురద, గుంతలతో ఇక అంతే సంగతి. రాత్రిళ్లు రాకపోకలకు భయపడాల్సిందే.

ఇబ్బందులు తీరాయి..
గట్టుసింగారం నుంచి లింగారంతండా వరకు ఉన్న చిన్న డొంకను పెద్దదిగా చేసి తారు వేశారు. మేం ఇదివరకు పొలాల కు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. వానాకాలం వస్తే చేలకు పోలేకపోయేవాళ్లం. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు అడుగుతుండగా.. ఇప్పుడు మా ఇబ్బందులు తీరిపోయాయి.
– ఆర్.ఉపేందర్, గట్టుసింగారం

నానా కష్టాలు పడ్డాం..
మా ఊరు నుంచి తిరుమలాయపాలెం మండలం బచ్చోడు వరకు కొత్తగా బీటీ రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే మా ఊరికి కూడా బడి బస్సులు వస్తుంటాయి. మొన్నటి వరకు ఈ రోడ్డు కంకర తేలి, గుంతలు పడి ఉండడంతో నానాకష్టాలు పడ్డాం. ఇప్పుడు ఆ సమస్య లేదు.
– ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డి, గైగోళ్లపల్లి

ఇటువంటి దీన స్థితిలో ఉన్న రహదారులు నేడు బీటీగా మారుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు మార్గం సుగమం అవుతుండగా.. రైతులు, విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగంగా మారనున్నాయి.

భూములకు గిరాకీ..
గ్రామాల్లో కొత్త రహదారులు నిర్మించడమే కాక గతంలో వేసిన బీటీ రహదారులు దెబ్బతినడంతో పాటు ఇరుకుగా మారడంతో వాటిని కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా.. అట్టి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. రహదారుల అభివృద్ధి, నిర్మాణంతో దారి కష్టాలు తీరడంతో పాటు భూములకు గిరాకీ పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి


ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని కేశ్వాపురం గ్రామ పరిధి సీతారామ కెనాల్ పక్కన తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసచారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కెనాల్‌కు రెండు వైపులా ఏర్పాటు చేసి కాంట్రాక్టు పని అయిపోగానే తీసుకుపోయారని, దీంతో రైతులు పంట పొలాలు వేసే పరిస్థితి లేకుండా పోతుందని వివరించారు. ఈమేరకు ప్రాజెక్టు కాంట్రాక్టర్‌తో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, రైతులు కన్నెబోయిన వెంకటనారాయణ, దొడ్డ వెంకన్న, మండల వెంకటేశ్వర్లు, దొడ్డ రామయ్య, మరియమ్మ, వెంకటేశ్వర్లు, దొడ్డ కోటయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న కలెక్టర్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచి సకాలంలో అందించాలన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, 10 గంటల పనిదినాల జీఓను తక్షణమే రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర కార్యదర్శి కె.శ్రీనివాసు, నాయకులు బొమ్మకంటి బానోత్, రవి నాయక్, రమేష్, కిన్నెర నారాయణ, శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో తెలంగాణ విద్యారంగం


ర్యాలీలో నాయకులు, విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్య ధోరణి కారణంగా తెలంగాణలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్ అన్నారు. శనివారం ఖమ్మంలో విద్యారంగ సమస్యలపై ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన స్థానిక జెడ్పీ కార్యాలయం నుంచి పెవిలియన్ గ్రౌండ్ సమీపంలోని అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించాక మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలనీ, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, జిల్లా నాయకులు బి.రాము, జంపన్న, రాకేష్, చరణ్, వికాస్, యాలాద్రి, జగదీష్, వీరబాబు, నర్మదా, మన్విత, ప్రవళిక, ఎస్‌కె.సానియా, ఉపేందర్, వీరబాబు, రోహిత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

కొనసాగుతున్న గ్యాంగ్‌వర్క్‌లు..
నగరంలో గ్యాంగ్‌వర్క్‌లు కొనసాగుతున్నాయి. శనివారం 9, 22, 23, 25వ డివిజన్లలో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఒక్కో డివిజన్‌లో 20 మంది చొప్పున కార్మికులను ఏర్పాటు చేసి పనులు చేయించారు. ఇక జేసీబీలతో మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఏఎంసీ

ఖమ్మంమయూరిసెంటర్: వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కేఎంసీ ఆధ్వర్యాన నగరంలోని 16వ డివిజన్‌లో గల మైనారిటీ పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచనల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ మార్పులు అనే అంశాలపై పోటీలు నిర్వహించగా.. అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

రేపటి ప్రజావాణి రద్దు..
ఈ నెల 22న సోమవారం బోనాల పండుగను పురస్కరించుకుని ఖమ్మం నగర పాలకసంస్థ ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని సెక్షన్–5 పరిధిలో ఉన్న జమ్మిబండ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్–1 ఏడీఈ నాగార్జున శనివారం తెలిపారు. దీంతో జమ్మిబండ ప్రాంతం, సిద్దార్థ ఆస్పత్రి ఏరియా, ఆరోగ్య ఆస్పత్రి, సీక్వెల్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

డిజిటల్ బోధన ప్రారంభం

ఖమ్మంసహకారనగర్: ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్, ఆర్ట్స్ విద్యార్థులకు స్థానిక ఏఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు ఆధ్వర్యాన నీట్, ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ఫిజిక్స్ వాలా, ఖాన్ వాలా ఆర్గనైజేషన్ ద్వారా నిర్వహిస్తుండగా.. విద్యార్థులకు పోటీ పరీక్షలతో పాటు ఇంజనీరింగ్‌లో ఉచిత ప్రవేశం కూడా లభిస్తోంది.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం విజయనగర్‌కాలనీలో మహిళ మెడలో నుంచి దుండుగుడు గొలుసు చోరీచేశాడు. కాలనీకి చెందిన దీకొండ్ల దుర్గ ఉదయం ఇంటి ముందు ఊడుస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. ఆమె మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కుని పారిపోయాడు. ఘటనపై దుర్గ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

యువకుడిపై కానిస్టేబుల్ దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తనపై దాడి చేశాడని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ బాయ్ రెడ్డిమళ్ల శేషగిరి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. శివాయిగూడెంనకు చెందిన శేషగిరి ఈ నెల 12న అర్ధరాత్రి సినిమా చూసి వెళ్తున్నాడు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పెట్రోలింగ్ పోలీసులు ఆపడంతో వివరాలు చెప్పగా వెళ్లాలని సూచించారు. దీంతో ఆయన బైక్‌పై ముందుకు రాగా కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు లాఠీ విసరడంతో రెండు పళ్లు ఊడిపోయాయని, చికిత్స అనంతరం శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించాడు. ఈ విషయమై సీఐ బాలకృష్ణ వివరణ కోరగా శేషగిరి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

17 ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఖమ్మంక్రైం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 17 ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ట్రాక్టర్లను సీజ్ చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


రామకృష్ణ (ఫైల్)

ఖమ్మంఅర్బన్/ఖమ్మంక్రైం: ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు దేవరకొండ రామకృష్ణ (51) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన ఆయన ఇక్కడ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణకు విజయవాడలో చికిత్స చేయిస్తుండగా శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉండగా, రామకృష్ణ మృతిపై జిల్లా హోంగార్డు ఆఫీసర్ల అసోసియేషన్ బాధ్యులు సంతాపం తెలిపారు.

వాకింగ్ చేసి వస్తున్న వ్యక్తి...
ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీ జీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో వాకింగ్ పూర్తిచేసిన వ్యక్తి సర్దార్ పటేల్ స్టేడియానికిచేరుకోగా అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. ఖమ్మం శ్రీనగర్ కాలనీ రోడ్ నంబర్–4కు చెందిన జీఎల్.నర్సింహారావు లోకల్ ఫండ్ కార్యాలయంలో విధులు నిర్వహిర్తిన్నాడు. రోజులోగా శనివారం సాయంత్రం వాకింగ్ చేశాక సర్దార్ పటేల్ స్టేడియం మీదుగా ఇంటికి వెళ్తూ స్విమ్మింగ్ పూల్ వద్ద కూర్చున్నాడు. అక్కడ ఆయన గుండెపోటుతో కింద పడిపోగా వాకింగ్‌కు వచ్చిన వారు సీపీఆర్ చేస్తూ 108లో ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రూ.26లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) నుంచి రూ. 26 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో గల ఎంపీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారిలు 80 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం అర్హులంతా సీఎంఆర్‌ఎఫ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, నాయకులు పరికపల్లి శ్రీను, కాంపాటి వెంకన్న, ఎయిర్‌టెల్ నరసింహారావు, షేక్ మాజీద్, మెండే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

'ఎస్‌వీఎం'లో స్టూడెంట్ ఎలక్షన్స్


మాట్లాడుతున్న సీఐ మోహన్, పక్కన డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్ ఎస్‌వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థి సంఘ నాయకుల ఎన్నిక నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ కిషోర్, కొండా శ్రీధర్‌రావు, ఉమా కిషోర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రీటౌన్ సీఐ మోహన్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

రఘునాథపాలెం జెడ్పీ పాఠశాలలో..


గెలుపొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాధాన్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా చేయాలని ఈ ఎన్నికలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో విద్యార్థి సంఘ నాయకుడిగా ఎస్‌కె.ముషామహమద్, ఉపసంఘ నాయకుడిగా కాపర్తి మణిసాయి విజయం సాధించారు. ఉపాధ్యాయులు వీరాంజనేయులు, జి.అరుణ, పీ.డీ.సునీత, పి.పద్మావతి నిర్వర్తించారు.

పాఠశాలల్లో బోనాల సందడి

ఆషాఢ మాసం సందర్భంగా నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా విద్యాసంస్థల బాధ్యులు బోనాల ప్రత్యేకతను తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంసహకారనగర్: స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు


సర్వజ్ఞ పాఠశాలలో బోనాల వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ



నేలకొండపల్లి: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బోనాలతో విద్యార్థులు


విన్‌ఫీల్డ్ పాఠశాలలో బోనాల వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్లు పుల్లారావు, కిషోర్, శ్రీకాంత్


త్రివేణి పాఠశాలలో పూజ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు

నిర్లక్ష్యానికి నిలువుటద్దం..

- పెవిలియన్ గ్రౌండ్‌లో ఇంకా ఎగ్జిబిషన్ పరికరాలు
- నెలలు గడుస్తున్నా తీయని వైనం
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- వాకర్లు, క్రీడాకారులకు ఇక్కట్లు


గ్రౌండ్‌లో వదిలేసిన ఎగ్జిబిషన్ పరికరాలు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం కార్పొరేషన్ మరోసారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. నగరంలోని పెవిలియన్‌గ్రౌండ్‌లో నిత్యం వాకర్లు, క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో తర్ఫీదు పొందుతుండగా.. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యం కారణంగా వారికి అందుబాటులోకి రాలేకపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదు నెలల క్రితం పెవిలియన్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభమై దాదాపు నెలకు పైగా కొనసాగింది. ఇందు కోసం మున్సిపాల్ కార్పొరేషన్‌కు అద్దె కూడా నిర్వాహకులు చెల్లించారు. కానీ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పరికరాలను ఇక్కడే వదిలి వెళ్లడంతో వాకర్లు, క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు.

నెలలుగా ఇబ్బంది..
ఎగ్జిబిషన్ అయిపోయి నెలలు గడుస్తున్నా నిర్వాహకులు పరికరాలను తీసుకుపోలేదని వాకర్లు, క్రీడాకారులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోతోంది. గ్రౌండ్‌లో అధిక స్థలం పరికరాలతోనే నిండిపోవడంతో వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన వాటిని తొలగించి మైదానాన్ని వినియోగించుకునేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పెవిలియన్ గ్రౌండ్‌లో ఉన్న ఎగ్జిబిషన్ పరికరాలను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాని ఇంత వరకు వీటిని తొలగించలేదు. నిత్యం వస్తున్న వాకర్లు వ్యాయామం చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా వాటిని తొలగించి తగిన చర్యలు తీసుకోవాలి.
– మంద వెంకటేశ్వర్లు, వాకర్

నిర్లక్ష్యం తగదు..



ఎంతో మంది ఈ గ్రౌండ్‌లోనే ఉన్నత క్రీడాకారులుగా ఎదిగారు. ఇలాంటి గ్రౌండ్‌కు ఈ దుస్థితి రావాడం బాగలేదు. ఎంతో చరిత్ర కలిగిన ఈ గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేసేలా మున్సిపల్ శాఖ చర్యలు తీసుకుంటే బాగుంటుంది. క్రీడాకారుల ఉన్నత స్థితికి చేరేందుకు దోహదపడుతుంది. గ్రౌండ్‌ను తీర్చిదిద్దాలి.
– రావూరి శ్రీనివాస్, వాకర్

పూర్వస్థితికి తీసుకురావాలి..



పెవిలియన్‌గ్రౌండ్ గతంలో క్రీడలతో నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం మున్సిపాల్ కార్పొరేషన్ నెలల తరపబడి అద్దెకు ఇవ్వడంతో మైదానం నాణ్యత కోల్పోతుంది. దీంతో వాకర్లు, క్రీడాకారులు రావాలంటే ఆలోచించాల్సి వస్తుంది. ఎగ్జిబిషన్ ముగిసినా నెలల తరబడి పరికారాలు ఉండడంతో మున్సిపల్ తీరును ప్రశ్నిస్తున్నారు.
– గంగావరపు వీరభద్రం, వాకర్